క్లుప్తంగా

రేపు విద్యుత్ అంతరాయం

వేంపల్లె : ఇడుపులపాయ, వీరన్నగట్టుపల్లెల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జేఈ శివ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఇడుపులపాయ 11కేవీ ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

ఆటల పోటీలకు పేర్లు నమోదు చేసుకోండి

సింహాద్రిపురం : మండలంలో 15 సంవత్సరాలు దాటిన యువతీ, యువకులు 'ఆడుదాం ఆంధ్రా' పోటీలకు పేర్లు నమోదు చేసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ నాగలింగాచారి, ఎంపీడీఓ కృష్ణమూర్తిలు తెలిపారు. ఆటల పోటీలలో పాల్గొనదలచిన వారు తమ పేర్లను సచివాలయంలోని పంచాయతీ సెక్రటరీకి కానీ, డిజిటల్ అసిస్టెంట్‌కు గాని తమ ఆధార్ కార్డు, ఫోన్ నెంబరును ఇచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ ఆటల పోటీలు అక్టోబర్ 2 నుంచి నవంబర్ 9 వరకు జరుగుతాయని క్రికెట్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహిస్తారన్నారు. మొదట సచివాలయ పరిధిలో, మండలస్థాయి, నియోజకవర్గస్థాయి, జిల్లాస్థాయిలో, రాష్ట్రస్థాయిలో నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేస్తారన్నారు. ఆసక్తి గల వారు పేర్లు నమోదు చేసుకోవాలని వారు తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు ఆహ్వానం

పులివెందుల రూరల్ : పులివెందుల ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు నోటిఫికేషన్‌లు విడుదల చేశారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సీడీపీఓ శ్రీలత అన్నారు. తొండూరు మండలం తొండూరు-1 బీసీ-ఎ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఖాళీగా ఉందన్నారు. అలాగే అంగన్‌వాడీ సహాయకులు తొండూరు మండలం ఇనగనూరు-1 బీసీ-బి కేటగిరి, లింగాల మండలం అంబకపల్లె ఓసీ, లింగాల మండలం లింగాల-1 ఎస్సీ, సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరు వీహెచ్ కేటగిరికి సంబంధించి పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 8వ తేదీలోపు దరఖాస్తులను సీడీపీఓ కార్యాలయంలో ఇవ్వాలన్నారు.

కంపచెట్ల తొలగింపు

లింగాల : మండల కేంద్రంలోని రోడ్లకు ఇరువైపులా, తాగునీటి పథకాల వద్ద భారీగా పెరిగిన కంపచెట్లను తొలగించారు. సర్పంచ్ దస్తగిరమ్మ గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జేసీబీని పంపించి కంపచెట్లను తొలగించారు. దీంతో రహదారులకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను, నీటి పథకాల వద్ద ఉన్న చెట్లను తొలగించడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పక్కాగృహాల నిర్మాణాన్ని పూర్తి చేయండి

లింగాల : మండలంలో పక్కా గృహాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జున అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో పక్కా గృహాల నిర్మాణంపై మండలస్థాయి అధికారులతో రివ్యూ నిర్వహించారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పక్కా గృహాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా పింఛన్లు పంపిణీ, కొత్త పింఛన్ల మంజూరు వంటి కార్యక్రమాలను చురుగ్గా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేంద్రనాథ్, ఎంఈఓలు నారాయణరెడ్డి, ప్రసాద్, పంచాయితీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలవెల్లువపై అవగాహన సదస్సు

లింగాల : జగనన్న పాలవెల్లువ పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ మేనేజర్ దస్తగిరిరెడ్డి అన్నారు. గురువారం కడప జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పులివెందుల బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో కోమన్నూతల, పార్నపల్లె గ్రామాల్లోని సచివాలయాల్లో జగనన్న పాలవెల్లువపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాడిరైతులకు కడప డీసీసీ బ్యాంకు ద్వారా అతి తక్కువ వడ్డీకి పాడిరైతులకు రుణాలు అందిస్తున్నామన్నారు. జగనన్న పాలవెల్లువ పథకం ద్వారా పాడి పశువులు కొనుగోలు చేసి మహిళా పాడిరైతులు అధిక లాభాలు ఆర్జించాలని ఆయన పిలుపునిచ్చారు. బ్యాంకు ద్వారా అందిస్తున్న వివిధ రకాల రుణాల గురించి వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సునీల్‌కుమార్‌రెడ్డి, శివచైతన్యారెడ్డి, సీసీ సూర్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైజ్ఞానిక శాస్త్రాలకు నెలవు సంస్కృతం

వైవీయూ : అంతరిక్ష విజ్ఞానం, వైమానిక విజ్ఞానం వంటి అనేక వైజ్ఞానిక అంశాలకు నెలవు సంస్కృతభాష అని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా. చింతకుంట శివారెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో అంతర్జాతీయ సంస్కృత దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన ఆయన హయగ్రీవ జయంతి విశిష్టతను, జన్మరహస్యాన్ని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ అనేక సాహిత్య చరిత్రలకు పునాది సంస్కృతమన్నారు.

శాశ్వత భూహక్కు కల్పించడం హర్షణీయం

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : భూములు అనుభవంలో మాత్రమే ఉండి ఎలాంటి హక్కు పత్రాలు లేని రైతులకు సీఎం జగనన్న శాశ్వత భూ హక్కు-భూరక్ష పథకం ద్వార శాశ్వత భూహక్కు కల్పించడం హర్షణీయం అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని దేవరాజుపల్లెలో ఎంపీటీసీ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో 80 మంది రైతులకు 250 ఏకరాలకు సంబంధించిన శాశ్వత భూ హక్కు పత్రాలను ఎమ్మెల్యే రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది రైతులకు ఇలాంటి అవకాశం కల్పించిన జగనన్నకు ప్రతి రైతు తోడు ఉండాలన్నారు. ఎంత మంది సీఎంలు మారిన, ఎంత మంది పీఎంలు మారిన ఈ భూహక్కు పత్రాల జోలికి ఎవరూ వెళ్లలేదన్నారు. ఇది చాలా సాహసోపేతమైన నిర్ణయం అన్నారు. మిగిలిన రాష్ట్రాల్లో ఒక నియోజకవర్గానికి అంటే దాదాపు 2 లక్షల మందికి ఒక తహసీల్దార్, ఒక సర్వేయర్ మాత్రమే ఉంటారని, ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన మండల వ్యవస్థ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఒక మండలానికి ఒక తహసీల్దార్, ఒక సర్వేయర్ ఉండేవారన్నారు. అయితే సీఎం జగనన్న ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రతి 2 వేల జనాభాకు ఒక సర్వేయర్ ఉన్నాడని, దీని కారణంగా భూరీసర్వే చేసి రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలు మంజూరు చేశామన్నారు. జగనన్న సీఎం కాక ముందు వరకు బ్రిటీష్ హయాంలో చేసిన సర్వేనే ఆధారంగా తీసుకునేవారన్నారు. ఈ 120 ఏళ్లలో ఎన్నో మార్పులు జరిగినప్పటికి ఆర్ఎస్ఆర్‌లో మాత్రం ముందున్న పేర్లే ఉండేవన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో జగనన్న ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ఇక నుంచి రైతులకు తమ భూముల పట్ల అన్ని హక్కులు లభిస్తాయన్నారు. వాటిని తనఖా పెట్టుకోవచ్చని, విక్రయించుకోవచ్చని, రుణాలు సైతం పొందవచ్చన్నారు. ఈ నిర్ణయంతో వేల మందికి ప్రయోజనం చేకూరుతుందని, ఇతరుల పొలాలు తీసుకునే వారికి ఈ నిర్ణయం మింగుడు పడదని విమర్శించారు. మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, నాయకులు సూరారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, గఫార్‌బాషా, కృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామలక్ష్మిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

వల్లూరు : కమలాపురం నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 12 మందికి ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందచేశారు. కడప నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఆయన 12 మంది లబ్ధిదారులకు రూ.11,05,000 విలువ గల చెక్కులను అందజేసి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తూ వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా కార్పొరేట్ వైద్య శాలల్లో చికిత్స పొందడానికి అవకాశం కల్పిస్తూ వ్యాధుల సంఖ్యను గణనీయంగా పెంచారన్నారు. ఆరోగ్య శ్రీ పథకం కింద వర్తించని జబ్బులకు సంబంధించి చికిత్సలు పొందిన బాధితులను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యంగా మారిన ఆరోగ్య శ్రీ పథకానికి జీవం పోసి కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందేలా సీఎం జగన్ మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారన్నారు. దీనితోపాటు దేశంలో ఏ రాష్ట్రంలోలేని విధంగా ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సలు పొందిన వారికి వారు ఇంటి వద్ద విశ్రాంతి తీసుకునే కాలానికి ఆరోగ్య ఆసరా ద్వారా నగదు అందిస్తూ ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల వైఎస్ఆర్‌సీపీ నేతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

పెండ్లిమర్రి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలతో లబ్ధిచేకూరుతోందని ఎమ్మె ల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం నంది మండలం-1 గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సీకెదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డితో కలిసి ఆయన ప్రభుత్వ సంక్షేమ పథకాలగురించి ప్రజలకు వివరించి వారి సమస్యలను తెలుసుకుని స త్వరం వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, సర్పంచ్ రామమోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు లలిత, సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు రవి, విజయ భాస్కర్‌రెడ్డి, వెంకటయ్య, జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

పులివెందుల రూరల్ : నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ఏపీఎస్ఎస్‌బీసీ వారి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 60 రోజుల ఉచిత శిక్షణ కార్యక్రమానికి దరఖాస్తులు చేసుకోవాలని న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వయస్సు గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 8,10, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ చదివిన వారు తమ ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, 10వ తరగతికి సంబంధించిన సర్టిఫికెట్, నాలుగు కలర్ పాస్‌పోర్టు ఫొటోలతో న్యాక్ అకాడమీని సంప్రదించాలన్నారు. శానీహెవి మిషనరీ ద్వారా జేసీబీ ఆపరేషటర్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శానీ కంపెనీ ద్వారా శిక్షణ ఇచ్చి రాష్ట్రంలోని పలు మల్టీ నేషనల్ కంపెనీలలో ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విత్తన శుద్ధితో మంచి దిగుబడి

జమ్మలమడుగు : రైతులు విత్తనాలను శుద్ధిచేసి వాటిని ఉపయోగించినప్పుడు మంచి దిగుబడి వస్తుందని ఏఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిధిలోని గూడెంచెరువు గ్రామంలోని రైతులకు సెంచూరియన్ విశ్వసాయి కళాశాలకు చెందిన వ్యవసాయ విద్యార్థులు ఖరీఫ్ సాగుపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సాగు చేసే ముందు విత్తనాలను శుద్ధి చేసుకోవడంతో పాటు రైతుల వ్యవసాయ భూమిలో భూ పరీక్షలను నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో మహిళలది ప్రముఖ పాత్ర

పులివెందుల టౌన్ : దేశాభివృద్ధిలో మహిళలది ప్రముఖపాత్ర అని ఆర్ఎస్ఎస్ డిస్టిక్ ఫిజికల్ డైరెక్టర్ శ్రీకాంత్ అన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్‌వీఆర్ఎం ప్రభుత్వ బాలికల కళాశాలలో భారత దర్శన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ డిస్టిక్ ఫిజికల్ డైరెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ దేశఅభివృద్ధిలో మహిళలది ప్రముఖ పాత్రని, అందుకు నిదర్శనం ఈ మధ్యనే చంద్రయాన్-3 ప్రాజెక్టులో అత్యధిక మహిళలు భాగస్వామ్యం అవ్వడం గమనించవచ్చన్నారు. దేశానికి గొప్ప నాయకుల్ని అందించడంలో మహిళలదే కీలకపాత్ర అన్నారు. మండల ఇన్‌చార్జి హరికృష్ణ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలని అలాగే సమాజ నిర్మాణంలో కూడా ప్రముఖ పాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య, సాంస్కృతిక అధ్యాపకురాలు నాగేంద్రమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పండుగ


జమ్మలమడుగులో రాఖి కట్టి తమ్ముడికి బొట్టుపెడుతున్న అక్క


ఎర్రగుంట్ల : విద్యార్థినులకు రాఖీలు కడుతున్న విద్యార్థులు

జమ్మలమడుగు : పట్టణంలో రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. తమ్ముళ్లకు రాఖీలు కట్టడంతోపాటు మిఠాయిలు తినిపించారు. రాఖీ పండుగతో పట్టణంలో దుకాణాలలో సందడి నెలకొంది.

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో రక్షాబంధన్ గురువారం ఘనంగా నిర్వహించారు. దేవాలయాలలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. తిప్పలూరులో విద్యార్థునులతో విద్యార్థులతో రాఖీలు కట్టించి సంబరాలు చేసుకున్నారు.

కన్యతీర్థంలో శ్రావణ శోభ


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కన్యతీర్థంలో శ్రావణ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ బాలత్రిపుర సుందరీదేవికి విశేష పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం ఆలయ కమిటీ నిర్వాహకులు అమ్మవారికి లక్షకు పైగా గాజులతో ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. పురోహితులు హరినాథశర్మ అమ్మవారికి శ్రీ చక్ర పూజ అభిషేకాలు, సహస్రనామార్చనలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

వీరపునాయునిపల్లె : మండలంలోని సంగాలపల్లెలో వెలసిన శివకృష్ణ గోశాల, వేంపల్లె, ఎర్రగుంట్ల ప్రధాన రహదారిలోని పాలగిరి క్రాస్ వద్ద వెలసిన అవధూత కాశిరెడ్డినాయన ఆలయం, షిర్డీ సాయిబాబా ఆలయాల్లో గురువారం భక్తి శ్రద్ధలతో శ్రావణ పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. అనంతరం గోశాల ప్రాంగణంలోని కృష్ణాలయంలో భాగవత పఠనం, భగవద్గీత పారాయణం, భజన కార్యక్రమం చేపట్టారు.భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నేత్రదానాన్ని ప్రోత్సహిద్దాం


నేత్రదాన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సేవాసమితి అధ్యక్షుడు రాజు, ఉపాధ్యాయులు


నల్లపురెడ్డిపల్లెలో విద్యార్థుల మానవహారం

పులివెందుల టౌన్ : పట్టణంలోని రమణప్పసత్రం పాఠశాలలో 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా గురువారం నియోజకవర్గంలోని ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్‌లో స్నేహిత అమృతహస్తం సేవాసమితి నేత్రసేకరణ కేంద్రం ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

తొండూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ మాట్లాడుతూ అపోహలు వీడి కులమతాలకు అతీతంగా నేత్రదానాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేత్రసేకరణ కేంద్రం అధ్యక్షులు రాజు మాట్లాడుతూ ఎవరైనా మరణించిన సమయంలో 9966509364, 7093204537లకు సమాచారం అందిస్తే కార్నియాలను సేకరిస్తామని, నేత్రదానం యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. అనంతరం నేత్రదాన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, నేత్రనిధి టెక్నీషియన్ హరీష్, సేవాసమితి పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, సభ్యులు రాజా, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె జిల్లా పరిషత్ పాఠశాలలో 38వ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా గురువారం పాఠశాలలో విద్యార్థులకు నేత్రదానంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు, ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రవీంద్ర నాయక్ సేవలు మరువలేనివి

చక్రాయపేట : మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తూ బదిలీపై అన్నమయ్య జిల్లా సుండుపల్లెకు వెళ్లిన రవీంద్రనాయక్ సేవలు మరువలేనివని జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక మండల విద్యావనరుల కేంద్రం వద్ద ఆయనకు మండలంలోని ఉపాధ్యాయులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దారు రాజసింహ నరేంద్ర, ఎంపీపీ మాధవీ బాల కృష్ణ, మండల సమన్వయకర్త ఓబుళరెడ్డి తదితరులు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు జాఫర్ సాదిక్, రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయ సంఘనేతలు శివారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, పవన్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు వేలం పాట

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రాంతంలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు సంబంధించి గురువారం సెబ్ కార్యాలయంలో సెబ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. వేలంపాటలో వాహనాలకు సంబంధించి ప్రభుత్వం వారి వేలం పాట రూ.20 వేలకు పాడగా రూ.21,500లకు నాయక్ అనే వ్యక్తి వేలం పాట పాడి వాహనం దక్కించుకున్నారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ కళ్యాణ్ కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు నీటి తొట్ల ఏర్పాటు

జమ్మలమడుగు : పట్టణంలో పశువులకు తాగునీటి కోసం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఒకటో వార్డు కౌన్సిలర్ ముల్లాజానీ తొట్లను గురువారం స్థానిక టీటీడీ నారాపుర స్వామి దేవాలయం సమీపంలో ఏర్పాటు చేశారు. ఎక్కువగా ఆవులు ఉండటంతో వాటి కోసం నీటి తొట్లను ఏర్పాటు చేయించారు. ఆయన మాట్లాడుతూ సరైన వర్షాలు పడకపోవడంతో పశువులకు తాగునీరు లేక ఇబ్బందులు పడుతుండటంతో మంచినీటి తొట్లను ఏర్పాటు చేశామన్నారు.

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ట వేడుకలు

సింహాద్రిపురం : మండలంలోని రావులకొలను పంచాయతీ పరిధి అహోబిలాపురంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నిర్మించిన నూతన చంద్రాయుడు దేవాలయంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు నూతన విగ్రహ ప్రతిష్ట వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం చివరి రోజు శనివారం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

చిన్నప్పటి నుంచే విద్యపై దృష్టి సారించాలి

వేంపల్లి : చిన్న వయసు నుంచే విద్యపై దృష్టి సారించాలని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నారాయణమ్మ తెలిపారు. గురువారం వేముల మండలం వేల్పుల గ్రామంలోని సచివాలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని పూజ వ్యాసరచనలో మొదటి బహుమతిని, చిత్రలేఖనం పోటీలో ద్వితీయ బహుమతిని సాధించారు. విద్యార్థులు విజేతలుగా నిలిచినందుకు వారిని అభినందించారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు వితరణ


విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేసిన నాగలక్షుమ్మ

లింగాల : మండలంలోని పెద్దకుడాల గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయురాలు నాగలక్షుమ్మ పెద్దకుడాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం రూ.10వేలు విలువ చేసే ప్లేట్లు, గ్లాసులు వితరణగా అందజేశారు.ఆమె తండ్రి గంగిరెడ్డి, తల్లి కనకమ్మల సహకారంతో పేద విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందించినట్లు పాఠశాల హెచ్ఎం రామకృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ పరిహారం వచ్చేలా కృషి

- కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఓఎస్డీ, మండల ఇన్‌చార్జిలు

వేముల : రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నల్లచెరువుపల్లె గ్రామ సమీపంలో ఓఎస్డీ అనిల్ కుమార్ రెడ్డి, మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బయపురెడ్డిలతో కలిసి ఎండిన వేరుశనగ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో నల్లచెరువుపల్లె, కొవ్వూరు, పాలూరు, తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో రైతులు వేరుశనగ పంటను సాగు చేసుకున్నారన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల ఈ ఏడాది 60 రోజులు వర్షం లేకపోవడంతో వేల ఎకరాల్లో పంట ఎండిపోయిందన్నారు. పంట నష్టానికి సంబంధించి అధికారులతో పంట నష్ట అంచనా వేస్తామన్నారు. ఇప్పటికి ఈ క్రాప్ నమోదు పూర్తి కావస్తోందన్నారు. ప్రతి రైతుకు పరిహారం వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్ర పేరుతో లోకేష్, సాగునీటి ప్రాజెక్టులపై యుద్ధభేరి చెప్పి చంద్రబాబు నాయుడు ఇక్కడకు రావడం.. ఆ పాదాల ప్రభావంతోనే వర్షాల్లేక..వేల ఎకరాల పంట ఎండిపోయిందని ప్రజలే చర్చించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణ, భైరవేశ్వర దేవస్థానం చైర్మన్ రామసిద్ధారెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాజారెడ్డి, సొసైటీ అధ్యక్షులు గంగిరెడ్డి, ఎంపీటీసీ నరసింహా రెడ్డి, వర్రా నారాయణ రెడ్డి, జేడీఏ నాగేశ్వర రావు, ఏడీఏ అశోక్ రెడ్డి, ఏఓ చెన్నారెడ్డి, హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పుష్ప'గిరి' ప్రదక్షిణ


గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

వల్లూరు : పుష్పగిరి పుణ్య క్షేత్రంలో శ్రావణ మాస పూర్ణిమను పురస్కరించుకుని గురువారం గిరి ప్రదక్షిణ కార్యక్రమం ఘనంగా జరిగింది. పలు గ్రామాల నుంచి ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో తరలి వచ్చిన భక్తులు పుష్పగిరి కొండకు కొబ్బరి కాయలు కొట్టి భక్తి శ్రద్ధలతో గిరి ప్రదక్షిణ చేశారు. అనంతరం శ్రీ లక్ష్మీచెన్న కేశవ, శ్రీ సంతాన మల్లేశ్వర స్వాములను దర్శించుకుని పూజలు చేశారు. పెన్నా నదిలో స్నానాలు ఆచరించారు. శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయం ఆధ్వర్యంలో ఉదయం నుంచి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతన్న రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : నూతన వ్యవసాయ పద్ధతులపై నీటి యాజమాన్య సంస్థ కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ లింగారెడ్డి వీరప్రతాప్‌రెడ్డి అన్నారు. స్థానిక స్త్రీ శక్తి సభా భవనంలో మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆయన హాజరై మాట్లాడారు. వ్యవసాయంలో నూతన పద్ధతులు అధికంగా వచ్చాయని వాటిని రైతులు తెలుసుకుని శాస్త్ర వేత్తల సూచనల మేరకు పంటలు సాగు చేసుకోవాలన్నారు. ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ పిరోజ్ ఉద్యానవన పంటలలో పాటించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి సునీల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ రామలక్ష్మిదేవి, డాక్టర్ ప్రశాంతి, రైతులు పాల్గొన్నారు.

హిందూ ధర్మంపై విషప్రచారం తగదు


గీతానిజ్ఞాన అమృతం పుస్తకాన్ని చూపిస్తున్న బీజేవైఎం నాయకులు

వేంపల్లి : ధర్మప్రచారం పేరుతో హిందూ ధర్మంపై విష ప్రచారం జరుగుతోందని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలి హరిప్రసాద్ అన్నారు. గురువారం వేంపల్లి పట్టణంలో గీతనిజ్ఞాన అమృతం పేరుతో కొంత మంది పుస్తకాలు అమ్మడం చూసి వాటిని పరిశీలిస్తే అందులో మొత్తం అన్యమత ప్రచారానికి సంబంధించిన విషయాలు ఉన్నాయని తెలిపారు. తక్కువ ధరకు భగవద్గీతను ఇస్తామని మాయమాటలు చెప్పి గీత పేరుతో హిందూవులను మతమార్పిడిలకు ప్రేరేపిస్తున్నారన్నారు. లోకాసమస్తా సుఖినోభవంతు సర్వేజనా సుఖినోభవంతు అని చెప్పేది ఒక్క హిందూ ధర్మం మాత్రమేనన్నారు. ప్రతి ఒక్క హిందువు ఇలాంటి వాటిని ప్రతిఘటించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుస్మా, రామచంద్రారెడ్డి, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రైవేటీ కరణను అడ్డుకుంటాం


బస్సు జాతాలో మాట్లాడుతున్న ఓబులేసు

కమలాపురం : 32 మంది ప్రాణ త్యాగాలతో నిర్మితమైన విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఓబులేసు, జి.ఈశ్వరయ్య తెలిపారు. రాష్ట్రాన్ని రక్షించుకుందాం.. దేశాన్ని కాపాడు కుందాం..అనే నినాదంతో 17వ తేదీన విశాఖలో ప్రారంభమైన బస్సు జాత గురువారం కమలాపురం క్రాస్ రోడ్డుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2014లో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాగ్దానాలు ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఎన్నో ప్రాణ త్యాగాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీ కరించి కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని మండి పడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకోవడానికి ప్రతి ఒక్కరు ముందుండి పోరాడాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.